# స్వాతంత్ర్య - - జ్యోతులు

★ శ్రీ సూర్యభగవాన్లు ★

అతనిముఖంలో ఏదో అనిర్వచనీయమైన వాంఛ తొణుకొడుతూంది.

అంతంలేని ఆలోచన—తీరని సమస్యల్లోవున్నట్టుకళ్లు చెప్తున్నాయి.

కాని—

భావికార్య కర్తవ్యానికి ఏ కొత్త ఎత్తులు వేస్తున్నాడో—మాతృదేశ భవిష్యత్ ఎలా పరిణమిస్తూందోననో లేక స్వదేశస్వాతంత్ర్య రక్షణవిధానం ఏమిటో ఎలాగో అనో—

—లేదా ఏ స్వాతంత్ర్య స్వేచ్ఛావాయువుల్లో విహరిస్తోందో అతని హృదయం.

అదీకాక —

వూరే వూహలకు వేసేప్రశ్నలకు జవాబు వెతుక్కొంటున్నాడేమోనని ఆ కూడిన సభాభావం.

మరి నిజంగా అతని మనసులో ఏముందో—యితర్లకు ఎలా తెలుసు ?

మానవహృదయాల్ని చదవడం కష్టసాధ్యంకదా—అందులో ఆంతరంగిక పరిణామాలు దురవగాహాలుకదా? అదీగాక అతనుఒక దేశానికినాయకుడు. అతనిలోనిగొప్పతనం తనమాతృదేశానికి తానుపోరాడునంతటి గొప్పదేశభక్తుడేకాదు—పోరాడడానికి తగినదానినిగా దేశాన్ని తగినట్లుగా తయారు చేసాడు. దానిసత్వంలో—ఆరని దాస్యబాధలో వున్న దేశంలో ఒక స్వతంత్ర దివ్యజ్యోతిని దేదీప్యమానంగా వెలిగిస్తూ—

దానిస్ప్రజలిలో—స్వతంత్రానురక్తి—దేశభక్తి—నూతనశక్తిని గరపుతూన్న ఒక స్వేచ్ఛా తపస్వి—

ఒక ప్రాణికోసం—

ఆడదాని ప్రేమను పొందడానికి అతని హృదయం పరితపిస్తూందని సభికులు కలలోనైనా తలుస్తారు.

దానికి ఆ స్థానం ఏదీ ?

ఒక స్త్రీని—

అందులో పరస్త్రీని—విరోధికూతుర్ని తనదిగా—తనవశం చేసికొనడానికి మనసు కొట్టుకొంటూంధని—తలంపుల్తో తహతహ లాడుతున్నాడని.

దానిని సాధించడానికి తంటాలు పడుతున్నాడని ఎవరు వూహించారు ?

ఒకవ్యక్తిని తన స్వాధీనం చేసికోవడం సాధ్యమా అందులో అతడు సర్వాధికారి. సర్వాన్ని దేశానికి అర్పించిన దేశారాధకుడు—స్త్రీకి హృదయంలో స్థానం వుంటుందా? స్త్రీని ప్రేమించే అంత గాఢంగా దేశాన్ని కూడ ప్రేమిస్తాడు? అని కొందరు.

అందులో.

ఒక స్త్రీకి—

ప్రేమకోసం దాసు డౌతాడా. అని మరికొందరి అభిప్రాయం—

కాని జరిగేది కార్యనిర్వాహకసభ.

వచ్చింది క్లిష్టసమస్య.

సభ్యులు ఎవరి ధోరణి వారు మాట్లాడుతున్నారు.

కాని మన నాయకుడికి సభలో ఏమిజరుగు...ంది దృగ్గోచరం అవడంలేదు.

అతను సభలో వున్నాడు. అంతే! మనసు ఎక్కడ లగ్నమైవుందో! వూరిక నిదానించి చూసాడు తన్ను కాల్చేస్తున్నాడా అన్నట్లు.

అతని కళ్లు ఒక అట్టముక్కమీద వాలాయి.

ఆ దొక బొమ్మ.

ఓస్ ఆ బొమ్మకా ఆ కళ్లు ఆలా తాపత్రయపడేది!

అయితే అట్టముక్కలోనున్న ఆ బొమ్మే తనవైపు మరల్చుకుంది అతన్ని.

ఆ బొమ్మే అంతబాగుంటే ఆ నిజమైన ఆమె ఎంత బావుంటుందో! ఎంత అందంగా వుంటుందో !

అయితే అతన్ని అంతగా ఆకర్షించింది ఆ అందమైన ముఖవర్చస్సు—ఆ కాంతులీనే ఆ రెండుకళ్లు. ఆకళ్లల్లో ఎన్ని వినిర్మల ప్రేమకాంతులు తొణకాడినవో మరి యింకెన్ని భగ్నహృదయాలనైనా సంతోషపెట్టగల శక్తి—మహత్తు యిమిడివుందో. అని.

*    *    *

అయితే అతను కోరేది అర్ధాంగల కోరిక. సహజ వాంఛ. ప్రతిపురుషుడుకి స్త్రీకిఆఆకలివుంటుంది.ఆ ఆకల్ని తీర్చుకుంటాడు. తృప్తిపడతారు. అని విస్మరించాడు అతను.

కాని తనసేవాజీవనానికి ఏ అడ్డూ కొరత వుండదని కూడా నిశ్చయాన్ని దృఢంచేసికున్నాడు.

... ...

అతనంటే ఆ దేశ ప్రజలకు ప్రాణసమానం అతను ఏది చెప్పితే యిక దానికి అడ్డు—ప్రశ్న లేదు. మహా పురుషుణ్ణిగా పూజిస్తారు. అతను అధికారంతో చెప్పితే ప్రజలు ప్రేమతో చేస్తారు.

అతనొకడే ప్రజలపక్షానికి ఏకైకనాయకుడు. ప్రజా ప్రతినిధి. స్వదేశ స్వాతంత్ర్య రక్షకుడు.

... ... ...

నిద్రాణమై దాస్యంలో అణగివున్న జాతిని మేల్కొల్పి స్వతంత్రజ్యోతిని వెలిగించగల స్వతంత్రమూర్తని వారి ఆశ. స్వార్థం నీచత్వం లేని త్యాగస్వ—పుడని అతనొక్కడే వారి కష్టాలను గట్టెక్కించడానికి సమర్థుడని వారి పరమ ఆశ.

తీరనికోరిక.

*    *    *

ఆ పటంలో నున్న ఆమె ఎవరో తెలుసుకున్నాడు,

కాని ఆమె తన ప్రబలశత్రువు కూతురనే ద్వేషాగ్ని రగుల్తూంది. అయితే పవిత్ర ప్రణయజ్వాల మండుతూంది.

ఛీ! ప్రేమ! వెధవప్రేమ! ప్రేమకోసం నాపట్టుదలా—కార్యదీక్షా—నా దేశాన్ని నా జాతిని ఆత్మగౌరవాన్ని స్వతంత్రాన్ని మరిట గల్పేదా. అని హృదయం అవ్యక్తంగా కొట్టుకుంది కొంచంసేపు.

ఆహా! పొడుపగ! ఎందుకుండాలి.

'చక్కగ ప్రపంచాన్నంతా ఏకోన్ముఖంగా—సమత్వంతో ఒకే కుటుంబంగా— సోదరత్వంతో—స్వతంత్రంగా మార్చాలని వుద్దేశం—ఆశయం గల నాకు యీ యీర్ష్య, భావభేదం నా వుద్దేశాలకు విరుద్ధం. జాతి ద్వేషపూరితం కాకూడదు... భావికాలంలో నా మాతృదేశాన్ని సర్వతోముఖంగా సౌఖ్యప్రదంగా వర్ధిలునట్లు చిత్రించే భవిష్యత్ చిత్రకారునికి నా అసూయాగ్ని అడ్డుకదా! అసలు ఎందుకుండాలి భేదబుద్ధి. మానవులందరు—జన్మతహా ఒక తైను వుంటే....

జాతి అనేది పేరులాంటిది. అనే భావాలు స్ఫురించాయి—ముఖంలో ఒక కొత్తకళ వెలిగింది. జాతిమత భేదాల్నికట్టేస్తుంది ప్రేమజ్వాల'...అనుకున్నాడు మెరుపులాగ మెరిసింది. అతని భావాలవీధిలో, అతనిఆలోచనకు ఆ భావం ధైర్య మిచ్చింది. కోరికకు బలమిచ్చింది. నిశ్చయత్వానికి దారిచూపింది. కార్యానికి చురుకెక్కించింది. వజ్రసంకల్పానికి దోహదమైంది.

*    *    *

ప్రపంచంలో ఏ విషయాన్నైనా ధిక్కరించగల శక్తి ధైర్యం వుంది కాని ప్రియురాలివిషయంలో కాదు కూడదు అనేతిరస్కార భావమే లేదు...

అతని మనసు ఆమెలో లగ్నమైపోయింది. రసపిపాసిఅయాడు అనుకున్నారు అగ్నికణాలలాంటి అతని అనుచరులు. కూడా.

మరి అతనిఅంతరాగ్ని యింకొకళ్లకు అవగాహనం అవడం అసాధ్యంకదా! మరి అసాధ్యంకాదూ! తన మాతృదేశారాధనకు తన జీవన కుసుమాన్ని - ఆత్మ సౌఖ్యాన్ని గడ్డిపూచగ అనుకొని అర్పించు సిద్ధుడు ప్రేమదీపికకు కూడా ప్రాణతైలాన్ని పోస్తాడని ప్రజలు అనుకొనడం ఆశ్చర్యంకదూ!

దేశముక్తియే అతనిజీవనం - దేశభక్తియే జీవిత రహస్యం-ప్రజాస్వాతంత్ర్యమే అతనికి ప్రాణం—దానికోసం కృషిచేయడం ధర్మం... అందుకు జీవితాన్ని లెక్కచేయకుండా వుండడం ఆదర్శం-అన్న—

అలాంటి కళంకంలేని దేశభక్తుడు - దేశసేవాధురంధరుడు ఆమెకోసం నిరీక్షిస్తున్నాడు గంటలకొలది - దినాల తరబడి.

*    *    *

తన మాతృదేశం కోసం వీరబలిదానం చేసిన దేశభక్తుల పటాల్తో యితని ప్రియురాలి పటంకూడా అలంకరించాడు.

... ... ...

సేవయే కోర్కగాను - ప్రేమయే జీవితపరమావధిగాను- త్యాగమే లక్ష్యంగా గొన్న ఆ సుందరి ప్రఫుల్లచంద్ర

వదనం - సిగ్గులు తొలగిస్తూ - ఒయ్యారం ఒలికిస్తూ చిరునవ్వుతో చిందులు త్రొక్కుస్తూ వచ్చి నిలబడింది.

నిర్ఘాంతపోయాడు అతను.

తన జాతీయసమస్యలో ఎంత విషమపరిస్థితి నైనా సునాయాసంగా అత్యంత నేర్పుతో ఎదుర్కొనే అతని హృదయం నేడు ఎందుకో అవ్యక్తరోదరోదన చేస్తూంది- ఆమెను చూసిందే !

పొంగిపొంగి వచ్చే ప్రేమనువాహిన్ని - యౌవనోద్రేకంలో తరంగాలలాగ నెట్టుకొని వచ్చే కోరికను అరికట్టే ధీశక్తి - నిగ్రహించే సామర్థ్యం బలం లేమిచే క్రమంగా ఆమెను సమీపించాడు.

ప్రేమపువ్వు పుట్టి పుష్పించింది.

* * *

దేశమంతా అల్లుకుంది వాళ్ల ప్రేమగాథ.

"ఒక తుచ్ఛ క్షుద్రవిషయవాంఛకు ఒక స్త్రీకి లోబడ్డాడు.

మహాపురుషుడని - మహానాయకుడని వన్నెకెక్కి ఒక పగతుర కూతుర్ని ప్రేమించాడు. ఎంత హేయం! నీచం! గొప్ప హృదయంలో - వున్నత భావాల్తో నిండిన అతను - కామాంధకారంలో కన్నులు కనపడలేదు.

తన కీర్తిలతను స్వహస్తాల్తో కత్తిరించుకున్నాడు. తన నైతికజీవనాన్ని నాశనం చేసికున్నాడు. పవిత్ర జీవనం - స్వచ్ఛంద సేవనం పతనమయింది. అని ప్రజలు గోలచేసారు."

కానీ, 'అన్నీ గొప్ప గుణా లుండి ఒక్క చిన్ని లోపంవల్ల అధోగతి పాలైనవా రున్నారు...ఆ గుణాలే ఒక్కవైపున ఔన్నత్యాన్న ఒకవైపున సంకుచితత్వాన్ని యిస్తాయి. ఒక స్థితిలో వుపయోగపడి సౌఖ్యానిస్తాయి. ఒక స్థితిలో, ఒక కాలంలో, కొరత కీడుస్తాయి—.' అన్నట్లు గుణాల్తో సంబంధంలేని కర్మం అయితే, 'స్వార్థరహితమైన ప్రేమను అర్థం చేసుకునే జ్ఞానం యీ లోకానికి యింకా లేదు....' అనుకున్నారు కొందరు. ఒకప్పుడు జీవితంలో వున్నత శిఖరాన్ని అందుకోవడం తరువాత అధఃపతనం కావడం ప్రకృతి సిద్ధమేగా—

అదిగాక తాను జాతీయనాయకుడై స్వతంత్ర స్థాపనోద్యమాన్ని నడుపుతూ—రాజనీతి దురంధరుడై పేరు ప్రతిష్టలు కాపాడుకోవలసిన యీయన ప్రేమ. బంధాల్లో చిక్కుకోవడంలోని అర్థం ఏమిటి? ఇక మన స్వతంత్ర వుద్యమానికి కలకాలం నీళ్లువదులుకోవడమే నా అని ఎవరికి యిష్టమొచ్చినట్టు వాళ్లువాగారు. అతని ప్రేమకోసం వాపోవడం వ్యర్థమని తలిచారు మరికొందరు.

ఇంత అల్లరి తెరవెనుక జరుగుతున్నా — అతని ముందుకు వచ్చి 'అది తప్పు' అని వాదించే వీరసింహుడు లేకపోయాడు. కాని అతనికి తెలుసు ఒక పడతిని ప్రేమించినంత-మాత్రాన పేరు ప్రతిష్టలు పోవని—అదిగాక నా ప్రణయగాథతో—నా ప్రైవేటు జీవితంలో వారికేం పని.

గ్రంథంతోగాని కర్తతో ప్రసక్తా !

గొప్పోళ్ళ భండారం ఒక చిన్న తప్పుతో బయట పడుతుందట! కాని యిప్పు డేమి తప్పుచేశాను? యిదీ తప్పేనా? సహజ మానవ వాంఛ!

నాకు కూడా తెలుసు—

చెడ్డపేరు ఎన్ని క్షణాలు పట్టూందో మంచిపేరు రావడానికి ఎన్ని సంవత్సరాల కాలం పట్టూందో—

ఒక చెడ్డ పేరుతో, వున్న మంచికూడా వూడిపోతుందని కూడా తెలుసుకొని అక్కడ అలాంటి సంఘట్టనాలకు స్థానంలేదే! ఎందుకు యీ వెర్రి ప్రజలు అనవసరపు తప్పు అభిప్రాయాలు పట్టుకొని చస్తారు అని భావించాడు.

* * *

ప్రభుత్వం మట్టుకు నాయకుడికి యీ దెబ్బతో పలుకుబడి పోతుందని కులికింది.

విద్రోహులు వ్యతిరేకంగా ప్రచారం చేసారు.

ఆ నాడు బహిరంగ సభ. పెద్ద గుంపు కూడింది. మన నాయకుడు అకుంఠిత సాహసంతో అనర్గళ వాగ్ధోరణిలో 'కామ్రేడ్సు మాతృభూమిని ప్రేమించండి— మాతృదేశ స్వతంత్ర రక్షణానికి ప్రాణత్యాగాల్ని చేయడానికి కంకణం కట్టండి. మన స్వదేశంలో స్వతంత్రులుగా జీవించడానికి మనం ఏకార్యానికైనా సిద్ధంగా వుండాలి. అని మాట్లాడుతూంటే—

అంతలో ఎవరో 'ఒక కౌగితం ముక్కమీద మీమీద గంపెడాశతో మనతల్లి దాస్య విమోచన చేస్తారని నమ్మిక—కాని మీరు వక్ర మార్గాన మోహపిశాచ పాశంలో పడి మీపరమ ప్రధాన లక్ష్యాన్ని ఆశయాన్ని మరచినట్టుంది. మరిదేశం గతేంకావాలి"— అని ప్రశ్న పంపారు.

చదువుకున్నాడు. ఒక చిరునవ్వు నవ్వించి ప్రజలు అనుకున్నాడు. నేను పోతే యింకొకడు స్వతంత్ర సాధనానికి. నాతోనె పోదు యీస్వతంత్ర సమరాగ్ని—యీ తీవ్రాందోళన, మనదేశీయుడు వొకడున్నప్పటికీ యీ అగ్ని రగుల్తూ వుంటుంది.

కాని నాప్రధాన లక్ష్యాన్ని - నేను మరువను. మరవలేను అది నాలో యినికి రక్తంతోబాటు ప్రవహించే సంతతధార నిరంతరం వెలిగే —స్వతంత్ర జ్యోతి.........

అంతలో పగ సాధించాలి శత్రువులపై అనే కేక సభలోంచి వచ్చించి.

'పగ! ఎందుకుండాలి!'

'ప్రతిష్టకు' అనే కంఠం.

'ప్రతిష్టకా! పాడు ప్రతిష్ట! విశ్వమానవ సౌభాతృత్వం ఆశించే జాతిగదా—ఆదిగాక ప్రేమకు పగ అడ్డంరాదు. ప్రేమతో జయించాలి పగను. కాని నేడు మనం ఎదుర్కోవలసింది ప్రేమ సమస్య కాదు.

అంతకంటే అతీతం—తీవ్రతర సమస్య.'

ఏమది అనే గొంతుక—ప్రేక్షకుల్లోంచి.

'మనదేశదాస్యవిముక్తి ఎలాగ' అనేది.

కాని నా ప్రేమగాథతో మనరాజకీయ జీవితాన్ని—నా స్వాతంత్ర్య ఆశయాలను కోల్పోవలసిన అగత్యం అవసరంలేదు.

తరతరాలనుండి వచ్చే ఆచారాలను కట్టుకొని ప్రాకులాడు ..అర్థంలేని సాంఘిక ఆచారాలకు భయపడి నా స్వేచ్ఛా విహారాన్ని ఆపడానికి అంతరాత్మ యిష్టపడదు అన్నాడు.

అయితే ప్రకాభిప్రాయంలో నున్న శక్తిని బలాన్ని తెలుసుకోలేని మూఢుణ్ణికాదు నేను. కాని మీకు ఒక్క సందేశ మిస్తున్నా. ఇక మనకు విజయ సూచన చిహ్నాలు కనబడు తున్నాయి. మన తల్లి దాస్య విమోచన అవుక దినాలు— మనం చూసే కాలం వస్తూంది........

ఇప్పుడే మీ శక్తిని ప్రదర్శించాలి. మీ దేశ భక్తిని చూపాలి. మీ స్వతంత్రాను శక్తిని కనపర్చాలి. మన దేశమాత కోరేది: ప్రతివ్యక్తి తన విద్యుక్త ధర్మాన్ని తన దేశం కోసం తోడి సోదరుల స్వాతంత్ర్యం సంరక్షణానికి నిర్వహిస్తాడని.

అదే అమ్మ ఆ దేశంకూడా.

సభికుల్లో నవశక్తి విజృంభించింది. ధైర్యం వుత్సాహం వుద్రేకం చెలరేగింది. ప్రస్తుత స్థితిగతిని సింహావలోకనం చేసుకొన్నారు. విషయాల్ని పూర్తిగ అవగాహనం చేసికొన్నారు. తరువాత ఒక్కడూ ఆ ప్రేమ ప్రసంగం చేయలా. ఒక్కడూ ఆవిషయమై మెదిమి మెదపలా. పల్లెత్తుమాటా మంతిలేదు. జైయ్ జైయ్ ధ్వానాల్తో కరతాళాల్తో సభ సమాప్తమయింది.ఆనాడు.

* * *

ఆ నాటి వుపన్యాసం ప్రభుత్వానికి మరింత వేడిని కల్గించింది. మండేకట్టెను ఎగద్రోసి నట్లయింది. ప్రభుత్వం బాగా తెల్సుకుంది. ప్రజాశక్తి పెరిగిపోతోందని ప్రజా హృదయంలో స్వతంత్ర యిచ్ఛాగ్ని మండిపోతోందని—ఎలాగైనా స్వాతంత్ర్య వుద్యమాన్ని అరికట్టాలని గాఢతమ దుష్పరిపాలన —తన సార్వభౌమత్వం సుస్థిరం చేయాలని—ఏకచ్ఛత్రాధిపత్యంగా కలకాలంగా స్వతంత్ర రాజ్యాన్ని తన స్వతంగా చేసికోవాలని ఆశపడింది. భాగీరథ ప్రయత్నాలు చేసింది. భల్లూకపట్టు పట్టింది.

కాని ఆ ప్రయత్నం ఫలించాలంటే ఆ నాయకుని అరష్టు చేయడం అంతటితో స్వాతంత్ర్య వుద్యమం సమసి పోతుందని ప్రభుత్వం పిచ్చి అభిప్రాయం పడింది!

కాని అనుకున్నంత సేపు పట్టలేదు... అతన్ని బంధించడానికి.

* * *

మరునాడు పిడుగులాంటి వార్త ప్రజానాయకుణ్ణి బంధించారని,నిన్న యిచ్చిన రాజద్రోహకర వువుపన్యాస ఫలితమని! అరష్టుకు కారణం. అతని జైలు జీవితంవల్ల పేరు ప్రతిష్టలకు ఏమీ లోటురాలేదు. కాని ప్రజలకు అతనిమీద మరింత ప్రేమానురాగం పెరిగింది. తమ నాయకున్ని అరష్టుచేసారని నిరసనసభలు హర్తాల్లు జరిపారు. దేశమంతా ముక్తకంఠంతో మా నాయకున్ని వదలండి అనిఆందోళనచేసింది.

ఆయన జైల్లో మగ్గుతూవుంటే అతని స్థానాన్ని ఆక్రమించి సరియైన నాయకత్వం వహించడానికి అందరూ భయపడ్డారు.

* * *

అయితే ఒక స్త్రీరత్నం అందుకు సాహసించింది. స్వతంత్రపీఠాన్ని ఒక స్త్రీ ఆక్రమించింది. ప్రజలు అర్పించినారు ఆపీఠాన్ని ప్రేమ పురస్సరంగా.

క్రమశిక్షణ పొందిన సిపాయిలులాగ నాయకత్వం వహించి కదనత్రొక్కుచు పదం పాడుచు జాతీయ పతాకం చేనిడుకొని ముందు నడుస్తూంది. వెనుక స్వచ్ఛంద సేవకులు అనుసరిస్తూన్నారు. ఇసుకవేస్తే రాలని ప్రజాసమూహం. అందరూ ఏకకంఠంతో 'నిరంకుశ సామ్రాజ్యం నాశనమగుగాక! విప్లవం వర్ధిలుగాక! ప్రజాశక్తి జయించుగాక' జై స్వతంత్రమాతకు! అని కేకలు. కొందరు ఆవేశంపట్టలేక జైలుగోడల్ని పగలగొట్టాలి అని అరిచారు వుద్రేకంతో. ఆ జయధ్వనికి ప్రకృతి ప్రతిధ్వనించింది. ప్రభుత్వం గడగడలాడింది.

ఆ సారథ్యం వహించినది ఎవరో అనుకున్నారు.

వూరు పేరు లేని స్త్రీ అనుకున్నారు. ఆమె నాయకుని ప్రియురాలని తెలియదు! కాని ప్రభుత్వం తన జాత్తమ అన్యాయాల్ని బైటపెట్టూవుండడం స్వాతంత్ర్య యుద్ధం చేయడం ఆశ్చర్య పడింది. ఇక ప్రజాశక్తిని ప్రతిఘటించడం అభేద్యం అప్రతిహతం అనుకుంది.

ఉప్పెనలాగ వస్తూన్న స్వతంత్రశక్తి అజేయమనుకుంది. ఆశక్తిని ఎవరూ ఆపలేరు. దానిముందు ఆగలేరు అని ప్రభుత్వం చక్కగా తెలుసుకుంది.

ఇక సంధేగతని రాజీకి దేవులాడింది ప్రభుత్వం.

కాని ఆమె ప్రదర్శించిన నిరుపమాన ధైర్య సాహసాలు? అకుంఠిత కార్యోత్సాహం అతి అమోఘం. ఆమె వుద్బోధించిన వాక్యాలు ప్రజల్ని స్వతంత్రకాంక్షకు దారిచూపిస్తూంది? ఒకజాతిని యింకోజాతి అణగద్రొక్కి పెత్తనంచేయడం? ఒకస్వతంత్రరాజ్యాన్ని బానిసదేశంగా చేయడం చాల అన్యాయం? అందుకు ఒక దేశదాస్యవిమోచనానికి ఎంతత్యాగానైన్నా చెయ్యాలి. ఒక దేశస్వాతంత్రరక్షణం ముందు మన ప్రాణాలు ఏపాటివి? మానవజీవితాలు సముద్రపు అలలు. మరి దేశమా శాశ్వతమైంది-అందులో అమరత్వముంది-అని చాటింది.

* * *

ఈ సమయంలో సంధికి ఒప్పుకుంటే సంపూర్ణస్వాతంత్ర్యదారికి అడ్డకట్టు అని ఇప్పుడు పడిన శ్రమ? తాల్చినదీక్షతూవూనిన సత్యాగ్రహం? అంతా వృధా అనుకున్నారు. అసంతృప్తిని వెల్లడించిది ప్రజానీకం. క్రిక్కిరిసిన జనసమూహంలోంచి ఒక స్త్రీ కంఠం 'ముందు బోనులోనున్న సింహాన్ని వదలరడి' తరువాత ఆయన్తో సంప్రదించండి మా సంధిషరతులు అని గర్జించింది సగర్వంగా. ప్రజల్లో మరింత ద్విగుణీకృతోత్సాహం జాతీయోత్సాహం ప్రబలింది. ప్రభుత్వానికి వేరే గత్యంతరం లేక.

ఏషరతులు లేకుండా వారి స్వతంత్రనాయకున్ని వదిలారు. వాళ్ల రాజ్యాన్ని వాళ్లే పరిపాలించుకునే స్వతంత్రహక్కు వాళ్ల రాజ్యాంగచట్టాన్ని వాళ్లే సృష్టించుకొనే అధికారం పొందబడింది అని పరప్రభుత్వం ప్రకటించింది.

* * *

సంతోషం వొలగబోసుకుంటూ చిరునవ్వుతో స్వాగతమిస్తూ స్వతంత్ర పతాకాన్ని పట్టుకొని నాయకత్వం వహించిన అర్ధాంగిని ప్రేమింపు ఆలింగనం చేసికున్నాడు. చుట్టూవున్న ప్రజాసమూహం జే జేలు వందనాలు అందుకుంటూ గాలిలో చేతులు ఎగురవేస్తూ 'నా స్వతంత్ర ప్రజలు నా దేశం' అని గర్జించాడు. కోలాహలం రేగింది. సంతోషస్వాంతు లయ్యారు. వుత్సాహంతో బిగ్గరగా 'జై రాష్ట్రపతికి' స్వతంత్రరాజ్యస్థాపకునికి అని సంతోషంతో బిగ్గరగా ఏడ్చారు.

ఆనాటినుండీ ప్రజలలో వారిద్దరిమీదనున్న భేదం అంతరించింది.

* * *

దేశస్వపరిపాలనోద్యమానికి రాజకీయరంగంలో ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించ సాహసించి కష్టాలొడ్డి జయలక్ష్మిని చేకూర్చిన జాతీయ నిర్మాతలకు స్వతంత్ర నాయకుల దంపతులకు జోహార్లు అర్పిస్తూ గౌరవసూచకంగా వారిద్దరినీ గొప్ప వూరేగింపుతో బ్రహ్మాండ వుత్సవంతో పెద్దబహిరంగసభ ఏర్పాటు చేసారు ప్రజలు.

ప్రజల వుత్సాహానికి? ఆనందానికి మితి మేర లేదు.

ఒక పెద్ద ఎత్తైన వున్నతశిఖరాన్ని స్వతంత్ర జయ పతాకాన్ని కట్టారు. ఆ పతాకంమీద ఆప్రేయజ్యోతుల బొమ్మ చిత్రించబడి వున్నాయి.

ఆ నాడే స్వతంత్ర దినం, అదే క్రియారూపంలో స్వాతంత్ర్య దినప్రకటన.

* * *

ఎప్పటిలాగ దేశం నూతనవెలుగులో దివ్యశోభితమై అలరారుతూంది.